కానిస్టేబుల్ మృతికి హరీశ్‌రావు సంతాపం

కానిస్టేబుల్ నవీన్(ఫైల్)

సిద్దిపేట, నవంబర్ 13: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ నవీన్ మృతి చెందడంతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవీన్ పట్టుదలతో పోలీస్ ఉద్యోగం సంపాదించి ఉద్యోగ బాధ్యత నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. సామాజిక బాధ్యతగా, ఒక నిబద్ధతగా పనిచేశాడని ఆయన సేవలను కొనియాడారు. నవీన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. అతడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

కోహెడ పీఎస్ రైటర్ మృతి

కోహెడ, నవంబర్ 13: కోహెడ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న నవీన్ కుమార్ సోమవారం రాత్రి కోహెడ నుంచి సిద్దిపేటకు కారులో వెళ్తుండగా చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. సిద్దిపేటలో ఉంటున్న ఆయన విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నది. చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బలరామ్‌ను పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవపూర్, నవంబర్13: జగదేవపూర్ గ్రామానికి చెందిన మీటీవీ రిపోర్టర్ బలరామ్ తండ్రి శివరామ్ సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్ మాదాసుశ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండలమహిళా అధ్యక్షురాలు కవిత, స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, నాయకులు బాలకిషన్, ఐలయ్య, కనకయ్య వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పల్లా



మద్దూరులో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 13: మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో బుధవారం జరిగిన గాగిళ్లాపూర్ మాజీ ఎంపీటీసీ గూళ్ల సత్యకళాఆనందం దంపతుల రెండో కూతురు ప్రసన్న-సాయికుమార్ వివాహానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మద్దూరు మాజీ ఎంపీపీ బద్ది పడిగె కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నందనబోయిన నర్సింహులు, నలుగొప్పుల రేణుకారాములు, బీఆర్ఎస్ నాయకులు నల్ల బాల్‌రెడ్డి, జాటోత్ ఖల్‌రామ్, కోడూరు సిద్దిఖీ, ఇమ్మడి సంజీవరెడ్డి భాస్కర్‌రెడ్డి, రఘు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

నాసర్‌పుర అర్బన్ హెల్త్‌కేర్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పల్వాన్‌కుమార్

సిద్దిపేట, నవంబర్ 13: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి పల్వన్ కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంటకాలనీలోని బస్తీ దవాఖాన, నాసర్‌పుర అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తీరు, దవాఖాన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్, వైద్యులు అరుణ్‌కుమార్, నారాయణరావు, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గజ్వేల్, నవంబర్ 13: గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని జర్నలిస్టు కాలనీ వద్ద బ్రహ్మంగారి గుట్టపై పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతిని వీరబ్రహ్మేంద్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గణపతిపూజ, కలశారాధన స్వామికి షోడష ఉపచార పూజలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణంతో పాటు ఆర్ అండ్‌ఆర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చదువు దూరం చేస్తున్న కాంగ్రెస్

చేర్యాలలో మాట్లాడుతున్న శ్రీకాంత్

చేర్యాల, నవంబర్ 13: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద విద్యార్థులకు చదువు దూరమవుతున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ ఆరోపించారు. పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమంలో అమరత్వం పొందిన విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని గౌతమి జూనియర్ కళాశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులను దూరం చేసే విధానాలను కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్నదని ఆరోపించారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదన్నారు. విద్యార్థి ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగింపు సభను దుబ్బాకలో ఈనెల 16న నిర్వహిస్తున్నామని, విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంపత్‌కుమార్, అనిల్, అంజి, రమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపోల్, నవంబర్ 13: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అనాజీపూర్ గ్రామ విద్యుత్ ఫీడర్ లైన్ కింద చెట్లకొమ్మలు తొలిగిస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాయపోల్, తిమ్మక్కపల్లి, కొత్తపల్లి, టేంకపేట, చిన్నమాసాన్‌పల్లి, కృష్ణసాగర్, చౌదరిపాలెం, అనాజీపూర్, మంతూర్ గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

దాడుల నియంత్రణకు కఠిన చట్టాలు రూపొందించాలి

కొమురవెల్లిలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

చేర్యాల, నవంబర్ 13: ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు పాలకులు ప్రత్యేక చట్టాలు రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేయాలని మేజర్ టెంపుల్ ఉద్యోగుల(6ఏ) జేఏసీ కోవైర్మన్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల్లో పనిచేస్తూ ప్రమోషన్లు పొందిన ఉద్యోగులను మాతృసంస్థలకు బదిలీ చేసి ప్రమోషన్లు అమలు చేయాలని కోరారు. వికారాబాద్ కలెక్టర్‌తో పాటు ఉద్యోగులపై జరిగిన దాడిని తమ సంఘం ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు.సమావేశంలో ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, జూనియర్ అసిస్టెంట్ నర్సింహులుగౌడ్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే

చేర్యాల: సమీక్ష నిర్వహిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీరామ్‌రెడ్డి



రాయపోల్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న శంకర్ తదితరులు

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 13: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పట్టణంలో కొనసాగుతున్నది. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఉపాధ్యాయులు, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు సర్వేలో పాల్గొంటున్నారు. సర్వేలో పూర్తి స్థాయి సమాచారం కోసం అధికారులు అడుగుతున్నప్పటికీ ప్రశ్నావళితీరుపై ఒకింత ఆసంతృప్తి వ్యక్తం చేస్తూ సమాచారాన్ని అందజేస్తున్నారు.

సర్వేపై సమీక్ష

చేర్యాల, నవంబర్ 13: ప్రభుత్వం చేపట్టిన సర్వే పై నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ పి.శ్రీరామ్‌రెడ్డి మండల అధికారులు, సూపర్‌వైజర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి సర్వేలో ఎన్యూమరేటర్లు చేస్తున్న తప్పులను వివరించి వాటిని సరిచేసుకోవాలని సూచించారు.ఎన్యూమరేటర్లు చేసే సర్వేలో 15 అంశాల పై నమోదు చేయాల్సిన వివరాలను సిబ్బందికి వివరించారు. బాధ్యతారాహిత్యం వల్ల జరిగే తప్పులకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.సమావేశంలో మండల ప్రత్యేకాధికారి జి.నాగరాజు, తహసీల్దార్ సమీర్‌అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో ఎండీ.మహబూబ్‌అలీ, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఎంఈవో ఆర్.కిష్టయ్య, మండల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై డీబీఎఫ్ ప్రచారం

రాయపోల్,నవంబర్ 13 : సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ నాయకులు బుధవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని దళిత వాడలో జరిగిన సర్వేలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పర్యవేక్షించారు.కుటుంబాల వివరాల నమోదును పరిశీలించారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగోండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

జగదేవపూర్, నవంబర్ 13: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి యాదగిరి సూచించారు. బుధవారం మండలంలోని మునిగడప, తీగుల్ గ్రామాల్లో ఎంపీవో ఖాజామోహినొద్దీన్‌తో కలిసి పర్యటించారు. తీగుల్‌లో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాంరెడ్డి, హరీశ్, నరేందర్, సిబ్బంది అంగన్‌వాడీ టీచర్స్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలో కొనసాగుతున్న కుల గణన సర్వే

సమగ్ర సర్వేలో సూచనలు చేస్తున్న ఎంపీడీవో యాదగిరి

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నేత కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 13 : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు.బుధవారం కొండపాక మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని, పేద, మధ్య తరగతి కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిక్కుడు భానుు, పల్లె బాబు, కెమ్మసారం శ్యామ్, నవీన్, చంద్, రాకేశ్, అఖిల్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో మీనాంజనేయులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్13: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు బెక్కల్ గ్రామానికి చెందిన పాత రాములు వాటర్ ఫిల్టర్‌తో పాటు 84 వాటర్ క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ధూళిమిట్ట ఎంఈవో మాడిశెట్టి మీనాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు రక్షిత తాగునీటిని అందించేందుకు వాటర్ ఫిల్టర్ అందించిన రాములును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాటర్ ఫిల్టర్ అందజేసిన దాత పాత రాములను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నందనబోయిన నర్సింహులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర సుజాత, మాజీ చైర్మన్ దాసరి వేణుగోపాల్, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ

చేర్యాల, నవంబర్ 13: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ బుధవారం ప్రకటనలో వెల్లడించారు.కమిషనర్ ఆదేశాల మేరకు స్వామి వారి కల్యాణ వేదిక, చలువ పందిర్లు, బారికేడింగ్ పనులు, కల్యాణం, శివరాత్రి, అగ్నిగుండాల సందర్భంగా ప్రత్యేక దీపాలంకరణ పనులు ఈ-టెండర్ ద్వారా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.రూ.12కోట్లతో నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్ పనులు 60శాతం పూర్తి చేశామని, రానున్న జాతర సదరు క్యూకాంప్లెక్స్ ద్వారా క్యూలైన్లు నడిపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.క్యూకాంప్లెక్స్ పనులు క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ చేయిస్తున్నట్లు తెలిపారు. 50గదుల ధర్మశాలతో పాటు రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చేసిన ఎంబీ ప్రకారం బిల్లులు మంజూర వుతున్నాయని, సదరు పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వామి వారి అన్నప్రసాద వితరణ నిత్యం 50 మంది నుంచి 100 మంది భక్తులకు, ఆదివారం 100 నుంచి 200 మంది భక్తులకు పెంచినట్లు తెలిపారు.రూ.70లక్షలతో మల్లన్నగుట్ట పై భాగంలోని సూతిమాన్‌గుండ వద్ద త్రిశూలం,ధ్వమరుకం నిర్మాణం తుదిదశకు చేరుకుందని, బ్రహ్మోత్సవాల సందర్భంగా వాటిని ప్రారంభిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని వర్గాలు సహకరించాలని ఆయన కోరారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో బోధన

జగదేవపూర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజన్న

జగదేవపూర్, నవంబర్13: కార్పొరేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన చేపడుతున్నట్లు జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న అన్నారు. బుధవారం కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి పంటపై అవగాహన

కుకునూరుపల్లిలో అధిక సాంద్రత పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 13 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో అధిక సాంద్రత పత్తి సాగు చేస్తున్న పంటను బుధవారం వ్యవసాయశాఖ అధికారులు, మెదక్ జిల్లా తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందర్శించారు. అధిక సాంద్రత పత్తి సాగు చేయడం వల్ల తొందరగా పంట రావడంతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, ఏవో గోవిందరాజు, రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ దుర్గయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలి

సిద్దిపేట ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, నవంబర్13: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి అభిషేక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండివైఖరిని ఎండగట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, నవదీప్, హర్షవర్ధన్ రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

స్వర్ణకుమార్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్13: మద్దూరు ఉన్నత పాఠశాలలో డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడు కర్రోళ్ల స్వర్ణకుమార్ ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై చేర్యాల మండలంలోని నాగపురి ఉన్నత పాఠశాలకు వెళ్లాడు. ఉద్యోగోన్నతిపై వెళ్లిన స్వర్ణకుమార్‌ను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

తుక్కాపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

కొండపాకలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తొగుట, నవంబర్ 13: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని సీఐ లతీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని తుక్కాపూర్‌లో ఆయన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించడంతోపాటు నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కొద్దిరోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, దేవాలయాల్లో సీసీ కెమెరాలు లేక నిందితులను పట్టుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. తుక్కాపూర్‌లో కేఎన్ఆర్ నిర్మాణ సంస్థ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తొగుట ఎస్సై రవికాంతారావు, కేఎన్ఆర్ నిర్మాణ సంస్థ ప్రతినిధి కొండల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండపాకలో

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 13 : సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ సాధ్యమని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం కొండపాక మండల కేంద్రంలో తోగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాలను ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను అరికట్టడం సాధ్యపడుతుందన్నారు. గ్రామ రక్షణ కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటులో పోలీసులకు సహకరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మంచాల కనకరాములు, రేపాక స్వామితో పాటు పలువురిని ఏసీపీ అభినందించడంతో పాటు శాలువాతో సత్కరించారు.

ఉపాధ్యాయుడి మృతి తీరనిలోటు

సంతాప సభలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చేర్యాల, నవంబర్ 13: ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్వాటకం ధర్మారెడ్డి మృతి ఉపాధ్యాయ, విద్యార్థి లోకానికి తీరని లోటని పీఆర్టీయూ టీఎస్ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేచరేణిలో ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి సంతాప సభ పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ధర్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి కుటుంబానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 13: మై భారత్- నెహ్రూ యువకేంద్ర సిద్దిపేట, జిల్లా సమగ్ర శిక్షా సమన్వయంతో బుధవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో మాదక ద్రవ్యాలపై జిల్లా సమగ్ర శిక్షా, విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్ అధ్యక్షతన అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అవగాహన కల్పించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ శాంతి పాల్గొన్నారు.

పట్టభద్రుల గొంతుకనై పోరాడుతా

జగదేవపూర్, నవంబర్13: పట్టభద్రుల గొంతుకనై పోరాడుతానని కరీంనగర్ మాజీ మేయర్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బుధవారం గజ్వేల్‌లో ఆయన పర్యటించారు. వివిధ కళాశాలలు, పాఠశాలలను సందర్శించి పట్టభద్రులతో మాట్లాడారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

రాయపోల్, నవంబర్ 13: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళలు, రక్షణ, చట్టాలు, ర్యాగింగ్, ఈవిటీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి గ్రామాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్సై శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాల్వ నిర్మాణంపై గ్రామసభ

హుస్నాబాద్‌రూరల్, నవంబర్ 13: మండలంలోని మీర్జాపూర్‌లో వరద కాల్వ నిర్మాణంపై బుధవారం అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సమావేశాన్ని బహిష్కరిస్తూ హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువ మంది రైతులకు 1, 2 ఎకరాల భూములు మాత్రమే ఉన్నాయని, వరద కాల్వ నిర్మాణం వల్ల ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని కూడా కోల్పోయే అవకాశం ఉందన్నారు. సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేదని, అధికారులు కాల్వ నిర్మాణ పనులు రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

సిద్దిపేట టౌన్, నవంబర్ 13 : నేటి బ